www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 138 | హైదరాబాద్ | గురువారం | 10-09-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

**చేర్యాల, సెప్టెంబర్ 10 (సిద్దిపేట పవర్)**

చేర్యాల మండలంలోని నాగపురి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అందే విజయ్ కుమార్ ఆయన చేసిన బోధన మరియు బోధనేతర సామాజిక కార్యక్రమాలకు గాను ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సిద్దిపేటలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును జిల్లా కలెక్టర్ గారి చేతుల మీదుగా అందుకున్నారు...


జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని నాగపురి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, అందే విజయ్ కుమార్ ను బుధవారము నాడు ఘనంగా శాలువాతో పూలమాలలతో సన్మానించారు... ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎలికట్టే ఐలయ్య గారు మాట్లాడుతూ అవార్డులు రివార్డులు ప్రశంసలు వృత్తిలో మరింత బాధ్యతను పెంచుతాయని అన్నారు అవార్డులు రివార్డులు కొందరికి అలంకారప్రాయాలయితే అందె విజయ్ కుమారే అవార్డులకు అలంకారం ఆభరణం అని ప్రశంసించారు అర్హులకు అవార్డులొస్తే ఆనందపడతామని అన్నారు...

ఈ సన్మాన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎలికట్టే ఐలయ్య ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది ఎస్. కృష్ణమూర్తి టీ పద్మ ఎస్. నిరుపమ టి. మనోజ్ కుమార్ కే మాధవి సిహెచ్. యాదగిరి



కే. స్వర్ణ కుమార్ పి రాజేశ్వరి ఎస్. కనక లింగం జి.శ్రీధర్ ఎం. శ్రీనివాసరావు బి.ధనలక్ష్మి ఎండి ఉమర్ ఎస్. స్వామి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# సమాజంలో ఏకాకిగా..



## దేశ ప్రజలను వెంటాడుతున్న ఒంటరితనం

**ప్రతి ఆరుగురు భారతీయుల్లో ఒకరిని వేధిస్తున్న సమస్య**

**43 శాతం పట్టణ ప్రాంతవాసుల్లో ఇదే భావన**

**దీర్ఘకాలిక ఒంటరితనంతో ఒత్తిడి, గుండెజబ్బులు, స్ట్రోక్ ముప్పు**

**'ఇప్సోస్'తాజా అధ్యయనంలో విస్మయకర అంశాలు**

నిత్యం బంధువులు, స్నేహితుల నుంచి వాట్సాప్‌ను ముంచెత్తుతూ గుడ్‌మార్‌నింగ్ సందేశాలు.. ఆఫీసుకెళ్లగానే హాయ్, హలో పలకరింపులు.. వారాంతాల్లో స్నేహితులతో పార్టీలు.. ఏడాదంతా పండుగలు, పబ్బాలు, కుటుంబ వేడుకలు.. ఇలా సంఘజీవులుగా దైనందిక జీవితాన్ని గడుపుతున్నప్పటికీ మనోళ్లనుఒంటరితనం వేధిస్తోంది! ప్రపంచంలోకెల్లా అత్యధిక జనాభాగల దేశంగానే కాకుండా.. సాంఘిక, సామాజిక స్థాయిల్లో వివిధ బంధాలతో పెనవేసుకుపోయిన భారతీయుల్లో ఈ సమస్య రోజురోజుకూ పెరుగుతుండటం దేనికి సంకేతం?

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

దేశంలోని పట్టణవాసుల్లో ప్రతి ఆరుగురిలో ఒకరు తరచూ ఒంటరితనంతో బాధపడుతున్నట్లు తాజా అధ్యయనం వెల్లడించింది. వేగవంతమైన సామాజిక-ఆర్థిక మార్పులు, పాతుకుపోయిన సాంస్కృతిక అంశాల సంక్లిష్ట మిశ్రమం కారణంగా పట్టణ ప్రాంతాల వారు ఎక్కువగా ఒంటరితనంతో ఇబ్బంది పడుతున్నట్లు తెలిపింది. ఉపాధి లేక గ్రామాల నుంచి వలసల పెరుగుదల, పట్టణాల్లో అధికమవుతున్న వృత్తిపరమైన పోటీతత్వం, సుదీర్ఘ పనిగంటలు, సుదూర ప్రయాణాల వంటి అంశాలు ప్రజల్లో భావోద్వేగ అలసటకు దారితీస్తున్నట్లు పేర్కొంది.

**సంబంధాలన్నీ పైపైనే..**

ప్రముఖ గ్లోబల్ మార్కెట్ రీసెర్చ్, పబ్లిక్ ఒపీనియన్ స్పెషలిస్ట్ కంపెనీ 'ఇప్సోస్'ఇటీవల నిర్వహించిన సర్వే ప్రకారం పట్టణవాసులు పరస్పరం సత్సంబంధాలు కలిగి ఉన్నట్లు పైకి కనిపిస్తున్నా భావోద్వేగపరంగా ఒకరికొకరు కలవలేకపోతున్నారు. స్త్రీ, పురుష తేడాలు, పేద, ధనిక అంతరాలు, ప్రాంతాలు, పట్టణీకరణ వంటివి ఈ భావోద్వేగాలను ప్రభావితం చేస్తున్నాయి. అయితే సోషల్ మీడియా ఈ భావాలను కప్పిపుచ్చేందుకు.. బాధ, ఇబ్బందులను పక్కకునెట్టేందుకు

..మిగతా 2లో



## కిషన్ రెడ్డి రాజీనామా చేస్తే.. నేను చేస్తా

**నాకు కేంద్ర పెద్దల ఆశీర్వదం ఉంది**

**పార్టీ పెద్దలు పిలిస్తే వెళ్తా..**

**ఇక్కడి విషయాలన్నీ చెబుతా**

**గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్**



**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

ఎమ్మెల్యే రాజాసింగ్ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఎమ్మెల్యే పదవికి రాజీనామా అంశంపై మాట్లాడారు. కిషన్ రెడ్డి రాజీనామా చేస్తే తానూ రాజీనామా చేస్తానని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. దీనికి ప్లానింగ్ అంత కిషన్ రెడ్డి చేశారని ఆరోపించారు. తాను ఎప్పుడూ విమర్శలు చేయలేదని చెప్పారు.. కేంద్ర పెద్దల ఆశీర్వాదం, యోగి ఆధిత్యానాథ్ ఆశీర్వాదం తనకు ఉందన్నారు. గోషామహాల్‌లో ఎవరికి పార్టీ పదవి ఇచ్చారని ప్రశ్నించారు. ఇవాళ కూడా నా బీజేపీనే రేపు కూడా నా బీజేపీనే అన్నారు. పెద్దలు పిలిస్తే వెళ్తా.. ఇక్కడ ఉన్న అన్ని విషయాలు చెబుతా అని ఎమ్మెల్యే రాజాసింగ్ తెలిపారు. పార్టీ లోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. బీజేపీ తప్పు చేసినప్పుడల్లా తాను మాట్లాడుతూనే ఉంటానని చెప్పారు. రబ్బర్ స్టాంప్ గా మారొద్దని రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుకు సూచించారు. చివరగా ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను ఎమ్మెల్యేగా రాజీనామా చేయనని ఏమీ పీక్కుంటారు పిక్కోండని ఘాటు వ్యాఖ్యలు చేశారు. మరోవైపు.. రాజాసింగ్ వ్యాఖ్యలపై రాష్ట్ర బీజేపీలో

..మిగతా 2లో

## తులం బంగారం కాదు.. తులం ఇనుము కూడా ఇవ్వరు

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలను సొంత పోరాటంగా భావించాలి**

**కాంగ్రెస్ నాయకులపై డబ్బు వసూళ్ల ఆరోపణలు**

**మైనారిటీ నాయకులకు టికెట్లు ఇవ్వలేదు**

**బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ ప్రత్యేక పిలుపు**



**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉప ఎన్నికల ముంగిట బీఆర్ఎస్ నేత కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలు వస్తూ పోతూ ఉంటాయని, కానీ తమకు అండగా నిలిచిన మాగంటి కుటుంబానికి అండగా నిలబడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. త్వరలో జరగబోయే ఉప ఎన్నికలను ప్రతి కార్యకర్త తన సొంత పోరాటంగా భావించి పని చేయాలని ఆయన ఉద్ఘాటించారు. కాంగ్రెస్ నాయకులు 'హైడ్రా' పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఆ డబ్బులతో జూబ్లీహిల్స్‌లో ఓట్లు కొనాలని చూస్తున్నారని విమర్శించారు. అంతేకాకుండా, కాంగ్రెస్ నాయకులు దొంగ ఓట్లను రాయించారని, వాటిని తొలగించే బాధ్యతను బీఆర్ఎస్ నాయకులు తీసుకోవాలని సూచించారు. అక్టోబర్ చివరి వారంలో గానీ, నవంబర్ మొదటి వారంలో గానీ ఉప ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, బీహార్‌తో పాటు ఈ ఎన్నికలు రాబోతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు జిల్లాల్లో ప్రజలు మోసపోయారని, కానీ హైదరాబాద్ ప్రజలు మాత్రం వారిని నమ్మలేదని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ నాయకులు తులం బంగారం ఇచ్చేవాళ్ళు

..మిగతా 2లో

## మేడారం జాతరపై రాజకీయాలు వద్దు..

**కేసీఆర్‌పై మేడారం జాతర నిర్లక్ష్యం ఆరోపణలు**

**గద్దెల మార్పుపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష**

**తప్పుడు ప్రచారం చేస్తున్నారని సీతక్క ఆగ్రహం**

**భక్తుల సౌకర్యాలను ప్రతిష్టాత్మకంగా చూస్తున్న ప్రభుత్వం**



2



## నేపాల్‌లో చిక్కుకున్న వారికి అండగా సర్కార్

నేపాల్ సంక్షోభంతో తెలంగాణ వారి కోసం హెల్ప్‌లైన్

విదేశాంగ మంత్రిత్వ శాఖ, భారత రాయబార కార్యాలయంతో సమన్వయం

అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన వివరాల వెల్లడి

2



## తెలంగాణకు రక్షణ శాఖ భూములు.!

- ఢిల్లీలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ భేటీ
- ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి రక్షణ శాఖ భూముల బదిలీ విజ్ఞప్తి
- రాజీవ్ రహదారి విస్తరణకు 83 ఎకరాల భూమి అవసరం
- తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చర్చలో ప్రస్తావన

**ఢిల్లీ, సిద్దిపేట పవర్ :**

ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి

..మిగతా 2లో

## ఫార్ములా ఈ రేస్ కేసులో ఏసీబీ దూకుడు..

- 9 నెలల విచారణ అనంతరం ఏసీబీ కీలక నివేదిక ప్రభుత్వానికి సమర్పణ
- కేటీఆర్, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌పై పలు సార్లు విచారణ
- స్పాన్సర్ కంపెనీ నుంచి రూ.44 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు – క్విడ్ ప్రో కో నిర్ధారణ
- ఛార్జిషీట్ దాఖలు నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వ ఉత్కంఠ



2

## స్పృష్టి కేసులో కొత్త కోణం

డాక్టర్ నమ్రతను ఒకరోజు కస్టడీకి తీసుకుని విచారణ

పదేళ్ల సరోగసి కార్యకలాపాల్లో కోట్లు వసూలు.. పోలీసులు ఆవిష్కరణ

నగదు లావాదేవీలు, బ్యాంక్ ఖాతాలు , యాప్ ఆధారిత అక్రమాలు

**మరింత కస్టడీ , సీరియస్ దర్యాప్తు**

2




## టీజీపీఎస్సీపై తీవ్ర అసహనం

- పారదర్శకత లోపించిందని హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు
- తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం పై ఆక్షేపణ
- టీజీపీఎస్సీ సమాధానంపై అసహనం వ్యక్తం చేసిన కోర్టు




2

# కిషన్ రెడ్డి రాజీనామా చేస్తే.. నేను చేస్తా

**మొదటిపేజీ తరువాయి**

చర్చ కొనసాగుతోంది. పార్టీ పెద్దలు ఈ వ్యాఖ్యలను తప్పుపడుతున్నారు.

**రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాజకీయ సన్యాసం చేస్తా**

తనను టార్గెట్ చేస్తూ బీజేపీ ఆఫీస్ లో ప్రెస్ మీట్ పెట్టారని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు.. తాను బీజేపీకి రాజీనామా జరగడానికి కారణం అందులో తప్పులు జరుగుతున్నాయని తెలిపారు.. బీజేపీ కార్యకర్తలను పక్కన పెడుతున్నారని రాజీనామా చేసినట్లు వెల్లడించారు. ఇంకా ఎన్ని రోజులు తనను టార్గెట్ చేస్తారని అడిగారు. తాను బీజేపీ కార్యకర్తల కోసం మాట్లాడానన్నారు. బీజేపీ రాష్ట్రకమిటీలో 10నుంచి 12 మందిని సికింద్రబాద్ పార్లమెంట్ నుంచి తీసుకున్నారని చెప్పారు. ఇంతకీ ఇది రామ చందర్ రావు కమిటీ నా? మా కిషన్ రెడ్డి వేసిన కమిటీ నా? అని ప్రశ్నించారు. ఈ కమిటీతో బీజేపీ ప్రభుత్వాన్ని తెలంగాణలో తీసుకువస్తారా అన్నారు. ఒక వేళ తీసుకొస్తే నేను రాజకీయ సన్యాసం చేస్తా అని సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. పార్టీని సర్వనాశనం చేస్తున్నారని వారు ఫోన్ చేసి చెబుతున్నారు. ఎంపీలు ఈ కమిటీతో సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. ఆ విషయాన్ని బయటకు చెప్పారన్నారు.





# తులం బంగారం కాదు.. తులం ఇనుము కూడా ఇవ్వరు

**మొదటిపేజీ తరువాయి**



కాదు, మెడలో పుస్తెలను గుంజుకెళ్లే వాళ్ళు అంటూ తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తులం బంగారం కాదు కదా, తులం ఇనుము కూడా ఇవ్వడని ఎద్దేవా చేశారు. బతుకమ్మ, దసరా పండుగల ముందు ప్రజల వద్దకు వెళ్లి వారి అవసరాలు తీర్చాలని కార్యకర్తలకు సూచించారు. గతంలో మైనారిటీ నాయకుడైన అజారుద్దీన్‌కు సీటు ఇచ్చి, ఇప్పుడు ఆయనకు టికెట్ ఇవ్వకుండా బాగా డబ్బులు ఉన్నవారికి ఇస్తున్నారని కాంగ్రెస్‌పై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. మైనారిటీలకు టికెట్ ఇవ్వనప్పుడు వారు కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయాలని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ వాళ్ళు ఓటుకు పైసలు ఇస్తే తీసుకోవాలని, కానీ ఓటు మాత్రం తమకే వేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యలు జూబ్లీహిల్స్ రాజకీయాల్లో మరింత చర్చకు దారితీసే అవకాశం ఉంది.

# మేడారం జాతరపై రాజకీయాలు వద్దు..

- **కేసీఆర్‌పై మేడారం జాతర నిర్లక్ష్యం ఆరోపణలు**
- **గద్దెల మార్పుపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష**
- **తప్పుడు ప్రచారం చేస్తున్నారని సీతక్క ఆగ్రహం**
- **భక్తుల సౌకర్యాలను ప్రతిష్టాత్మకంగా చూస్తున్న ప్రభుత్వం**



**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

మేడారం మహాజాతర నేపథ్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఏబీఎన్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మంత్రి సీతక్క కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వం, ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మేడారం జాతర అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ఆమె ఆరోపించారు. కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతర నిర్వహణ, అభివృద్ధి పనులపై ముందుగానే ప్రణాళికలు రూపొందించి, వాటిని స్వయంగా పర్యవేక్షిస్తున్నారని సీతక్క తెలిపారు. మేడారం జాతరలో భక్తులు వేసే కానుకలను, బంగారం, డబ్బును ఉంచే గద్దెల వద్ద కొన్ని మార్పులు చేస్తున్నట్లు సీతక్క వెల్లడించారు. తాము, పూజారులు కలిసి చేసిన మార్పులు సీఎం రేవంత్ రెడ్డికి సంతృప్తి కలిగించలేదని, అందుకే ఆయనే స్వయంగా గద్దెల వద్దకు వచ్చి పరిస్థితిని సమీక్షించనున్నారని ఆమె వివరించారు. ఈ నెల 13న లేదా 14న సీఎం మేడారం పర్యటనకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. గద్దెల మార్పుపై కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. పూజారులు, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండానే ఈ మార్పులు చేస్తున్నామని ఆమె స్పష్టం చేశారు. "మేడారం జాతర ఒక పవిత్రమైన ఉత్సవం. దానిని రాజకీయాలకు వేదికగా మార్చవద్దు. ఇది కేవలం భక్తితో చూడాల్సిన విషయం" అని ఆమె హితవు పలికారు. మహాజాతర సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి సౌకర్యాలు మెరుగుపరచడానికే ఈ మార్పులు చేస్తున్నట్లు మంత్రి సీతక్క పేర్కొన్నారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన జాతరకు ఇప్పుడు సరైన ప్రాధాన్యత ఇస్తున్నామని, భక్తులు సంతోషంగా తమ మొక్కులు చెల్లించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని ఆమె అన్నారు. తెలంగాణ ప్రభుత్వం మేడారం జాతరకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, భక్తుల భద్రత, సౌకర్యాలపై పూర్తి శ్రద్ధ పెట్టిందని సీతక్క చెప్పారు. జాతర నిర్వహణలో గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా చూస్తున్నామని, ఇది రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా భావిస్తోందని ఆమె తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి పర్యటన తర్వాత ఈ పనుల వేగం మరింత పుంజుకుంటుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

# నేపాల్‌లో చిక్కుకున్న వారికి అండగా సర్కార్

- **నేపాల్ సంక్షోభంతో తెలంగాణ వారి కోసం హెల్ప్‌లైన్**
- **విదేశాంగ మంత్రిత్వ శాఖ, భారత రాయబార కార్యాలయంతో సమన్వయం**
- **అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన వివరాల వెల్లడి**

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

నేపాల్‌లో నెలకొన్న అల్లర్లు, రాజకీయ అస్థిరత నేపథ్యంలో, తెలంగాణ ప్రభుత్వం అక్కడి పౌరులకు అండగా నిలిచింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఒక ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసింది. నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ పౌరులకు, వారి కుటుంబ సభ్యులకు సహాయం అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతానికి, ఏ తెలంగాణ పౌరుడికి గానీ గాయాలు లేదా అదృశ్యమైనట్లు ఎలాంటి నివేదికలు అందలేదు. అయినప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ, అలాగే కాఠ్మండులోని భారత రాయబార కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ, అక్కడ ఉన్న తమ పౌరుల భద్రతను, అలాగే వారిని సురక్షితంగా వెనక్కి రప్పించే ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది.

**సహాయం కోసం తెలంగాణ పౌరులు ఈ క్రింది అధికారులను సంప్రదించవచ్చు:**

ప్రైవేట్ సెక్రటరీ, రెసిడెంట్ కమిషనర్ & లైజన్ హెడ్ వందన. ఫోన్: +91 9871999044.

లైజన్ ఆఫీసర్ జి. రక్షిత్ నాయక్ ఫోన్: +91 9643723157.

పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సిహెచ్. చక్రవర్తి.. ఫోన్: +91 9949351270.

పౌరులందరూ అధికారిక ప్రకటనలను మాత్రమే అనుసరించాలని, ధృవీకరించని సమాచారాన్ని నమ్మవద్దని, ఇతరులకు పంపవద్దని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో తన ప్రజల భద్రత, సంక్షేమం పట్ల తెలంగాణ ప్రభుత్వం నిబద్ధతతో ఉందని ఈ సందర్భంగా పేర్కొంది.

# సమాజంలో ఏకాకిగా..

**మొదటిపేజీ తరువాయి**

దోహదపడుతున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తమలోని భయాలను కప్పిపుచ్చుకోవడంతోపాటు వాటిని బయటకు వెల్లడిస్తే ఇతరుల దృష్టిలో చులకన అవుతామనే ఫియర్ ఆఫ్ మిస్సింగ్ ఔట్ (ఫోమో) భావన కూడా దీనికి తోడ్పడుతోంది.

**శారీరక, మానసిక సమస్యలు**

దీర్ఘకాలిక ఒంటరితనం తీవ్ర శారీరక, మానసిక సమస్యలకు దారితీస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల రోగనిరోధక శక్తి బలహీనపడటం, గుండె జబ్బులు, స్ట్రోక్ ప్రమాదం పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు. కేన్సర్ వంటి వ్యాధులకు గురయ్యే చాన్స్ ఎక్కువగా ఉంటుందన్నారు. మానసిక సమస్యలను ఎదుర్కొనే విషయంలో భారత్‌లో తగినంత మంది మానసిక ఆరోగ్య నిపుణులు లేకపోవడం అడ్డంకిగా మారుతోందని అభిప్రాయ పడుతున్నారు.

**పరిష్కారం ఏమిటి?**

కుంగుబాటుకు గురైనప్పుడు బాధితులు ఫోన్, చాట్ లేదా యాప్‌ల రూపంలో 'లిజనింగ్ సరోవ్ సెస్'ద్వారా సాంత్వన పొందొచ్చు. కష్టాలను విని నిపుణులు తగిన మద్దతు అందిస్తారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ కిరణ్ హెల్ప్‌లైన్ (1800-599-0019) 13 భాషల్లో 24/7 మానసిక ఆరోగ్య మద్దతు అందిస్తోంది.

అభిరుచిగల సమూహాలు, క్లబ్‌లు లేదా ఆన్‌లైన్ ఫోరమ్‌లలో చేరడం ద్వారా స్వచ్ఛంద సేవ, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం ఒంటరితనంతో ముడిపడిన ప్రవర్తనలను అధిగమించడంలో దోహదపడుతుంది.

ధ్యానం, యోగా, మైండ్‌ఫుల్‌నెస్ వంటి అభ్యాసాలు బాధితులను ప్రశాంతపరిచి ఆందోళనలు తగ్గిస్తాయి. ఈ అభ్యాసాలు నాడీ వ్యవస్థను ప్రశాంతపరచడంలో సహాయపడతాయి. కారిటసాల్ వంటి ఒత్తిడి హార్మోన్ల విడుదలను తగ్గిస్తాయి.

**సర్వేలోని ముఖ్యాంశాలు..**

- పట్టణ ప్రాంతాల్లోని 43% మంది భారతీయులు ఎక్కువ సమయం ఒంటరితనం ఫీలవుతున్నారు. పెద్ద నగరాల్లో ఇది 45 శాతంగా ఉంటోంది.
- ప్రతి ఆరుగురిలో ఒకరు తరచూ ఒంటరిననే భావనతో కాలం నెట్టుకొస్తున్నారు.
- 45 ఏళ్లకు పైబడిన వారిలో 20 శాతం ఓ మోస్తరుగా, 13 శాతం తీవ్రమైన ఏకాకి జీవితాన్ని అనుభవిస్తున్నారు.
- పురుషుల్లో ఒంటరితనమనే భావన క్రమక్రమంగా పెరుగుతోంది.
- ప్రతి నలుగురు టీనేజర్లలో ఒకరు ఒంటరితనంతో బాధపడుతున్నారు.
- పెద్ద వయసు వారిలో ప్రతి ముగ్గురిలో ఒకరు సామాజికంగా దూరంగా ఉన్నామనే భావనతో ఉన్నారు.



# ఫార్ములా ఈ రేస్ కేసులో ఏసీబీ దూకుడు..

- **9 నెలల విచారణ అనంతరం ఏసీబీ కీలక నివేదిక ప్రభుత్వానికి సమర్పణ**
- **కేటీఆర్, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌పై పలు సార్లు విచారణ**
- **స్పాన్సర్ కంపెనీ నుంచి రూ.44 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు – క్విడ్ ప్రో కో నిర్ధారణ**
- **ఛార్జిషీట్ దాఖలు నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వ ఉత్కంఠ**

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

ఫార్ములా ఈ కార్ రేస్‌కు సంబంధించిన కేసులో తెలంగాణ ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) దర్యాప్తు వేగవంతం చేసింది. సుదీర్ఘంగా 9 నెలల పాటు సాగిన విచారణ అనంతరం, ఈ కేసులో కీలక నివేదికను ఏసీబీ ప్రభుత్వానికి సమర్పించింది. నివేదికలోని అంశాల ఆధారంగా, అప్పటి మంత్రి కేటీఆర్‌తో పాటు పలువురిపై ఛార్జిషీట్ దాఖలు చేయడానికి అనుమతి కోరింది. ప్రభుత్వం నుండి అనుమతి రాగానే ఛార్జిషీట్ దాఖలు చేయనున్నట్లు ఏసీబీ వర్గాలు తెలిపాయి. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠకు దారితీసింది. ఈ కేసులో ఏసీబీ, అప్పటి ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ను ఇప్పటికే నాలుగు సార్లు విచారించింది. అలాగే, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ను ఐదు సార్లు విచారించి వారి స్టేట్‌మెంట్‌లను రికార్డ్ చేసింది. వీరితో పాటు బీఎల్ఎన్ రెడ్డి, కిరణ్ రావు, ఫార్ములా ఈ ఆర్గనైజర్లను (FEOలు) కూడా విచారించినట్లు ఏసీబీ నివేదికలో పేర్కొంది. ఏసీబీ విచారణలో ఫార్ములా ఈ రేస్ నిర్వహణలో క్విడ్ ప్రో కో (ఎవరో ఒకరు ఏదో ఇస్తే, దానికి ప్రతిఫలంగా మరొకరు వారికి ఏదో ఇవ్వడం) జరిగిందని నిర్ధారించినట్లు సమాచారం. ఈ రేసుకు స్పాన్సర్‌గా ఉన్న కంపెనీ, అప్పటి అధికార పార్టీకి రూ. 44 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లను చెల్లించినట్లు ఏసీబీ గుర్తించింది. ఈ లావాదేవీలు క్విడ్ ప్రో కోకు నిదర్శనమని ఏసీబీ తన నివేదికలో స్పష్టం చేసింది. ఏసీబీ తమ నివేదికను ఇప్పటికే ప్రభుత్వానికి అందజేసింది. ఈ నివేదికపై అడ్వకేట్ జనరల్‌తో న్యాయ సలహా తీసుకున్న ప్రభుత్వం, త్వరలో దీనిపై ఒక నిర్ణయం తీసుకోనుంది. ప్రభుత్వం నుండి అనుమతి రాగానే కేటీఆర్, అరవింద్ కుమార్ సహా నిందితులపై ఏసీబీ ఛార్జిషీట్ దాఖలు చేస్తుంది. ఈ కేసులో కఠిన చర్యలకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ నివేదికను గవర్నర్‌కు కూడా ఏసీబీ అందజేసినట్లు సమాచారం.



# టీజీపీఎస్సీపై తీవ్ర అసహనం

- **పారదర్శకత లోపించిందని హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు**
- **తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం పై ఆక్షేపణ**
- **టీజీపీఎస్సీ సమాధానంపై అసహనం వ్యక్తం చేసిన కోర్టు**
- **రెండు సెంటర్లలో రాసిన 71 మంది మహిళల ఎంపికపై సందేహాలు**

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

హైకోర్టు తాజాగా ఇచ్చిన 222 పేజీల తీర్పు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (TGPSC) పనితీరుపై తీవ్ర ఆక్షేపణలు చేసింది. గ్రూప్1 మెయిన్స్ పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపించిందని కోర్టు స్పష్టం చేసింది. ఇప్పటికే రెండుసార్లు గ్రూప్1 పరీక్షలు రద్దయినా, టీజీపీఎస్సీ తన పనితీరులో మార్పు తీసుకురాలేదని హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉండగా, మళ్లీ నిర్లక్ష్యంతో ముందుకు సాగిందని కోర్టు విమర్శించింది. తీర్పులో కోర్టు ముఖ్యంగా తెలుగు మీడియం అభ్యర్థుల సమస్యను ప్రస్తావించింది. ఇంగ్లీష్ మీడియం అభ్యర్థులలో 89.9% మంది సెలెక్ట్ అవ్వగా, తెలుగు మీడియం అభ్యర్థులలో కేవలం 9.95% మాత్రమే ఎంపిక కావడం తీవ్రమైన అసమానత అని పేర్కొంది. "తెలుగు మీడియం విద్యార్థులు బాగా రాయలేదనే నమ్మకం లేకపోతే రీవాల్యుయేషన్ ఎందుకు అడుగుతున్నారు?" అని కోర్టు ప్రశ్నించింది. ఆన్సర్ షీట్ల మూల్యాంకనంలో సరైన విధానాన్ని పాటించలేదని హైకోర్టు తేల్చి చెప్పింది. ఈ అంశంపై టీజీపీఎస్సీ ఇచ్చిన సమాధానంపైనా తీవ్ర అసహనం వ్యక్తం చేసింది.

అంతేకాకుండా, "ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (APPSC)లో గ్రూప్1 నియామకం మూడు దశల్లో జరుగుతుంది - ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ. కానీ తెలంగాణలో మాత్రం కేవలం ప్రిలిమ్స్, మెయిన్స్ మాత్రమే ఉన్నాయి" అని కోర్టు వ్యాఖ్యానించింది. అలాగే, రెండు సెంటర్లలో పరీక్ష రాసిన 71 మంది మహిళా అభ్యర్థులు ఎంపిక కావడం ఎలా సాధ్యమైందని కోర్టు ప్రశ్నించింది. ఈ అంశంలో కూడా టీజీపీఎస్సీ నిర్లక్ష్యం స్పష్టమైందని పేర్కొంది. "రోజుకు 12 గంటలు కోచింగ్ సెంటర్లలో శ్రమిస్తున్న యువతను టీజీపీఎస్సీ నిర్లక్ష్యం తీవ్రంగా నష్టపరిచింది" అని హైకోర్టు వ్యాఖ్యానించింది. నిరుద్యోగుల భవిష్యత్తు ప్రమాదంలో పడేలా పరీక్షలను నిర్వహించకూడదని కోర్టు స్పష్టం చేసింది.







# తెలంగాణకు రక్షణ శాఖ భూములు..!

**మొదటిపేజీ తరువాయి**

రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, తెలంగాణలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన రక్షణ శాఖ భూములను బదలాయించాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి స్కైవేలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం అత్యవసరం అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి రక్షణ శాఖ ఆధీనంలో ఉన్న భూములను రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరారు. ముఖ్యంగా, మెహదీపట్నం రైతుబజార్ వద్ద స్కై వాక్ నిర్మాణానికి భూమి అవసరమని, దీనివల్ల ప్రజలకు మెరుగైన సౌకర్యాలు లభిస్తాయని చెప్పారు. సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించిన మరో ముఖ్యమైన అంశం రాజీవ్ రహదారి విస్తరణ. హైదరాబాద్‌కరీంనగర్‌రామగుండంలను కలిపే ఈ రహదారిలో, ప్యాకేజీ జంక్షన్ నుండి ఔటర్ రింగ్ రోడ్డు జంక్షన్ వరకు ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి 83 ఎకరాల రక్షణ శాఖ భూమి అవసరమని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుందని వివరించారు. వీటితో పాటు, తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటుపైనా ఈ సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం. సీఎం వెంట పలువురు తెలంగాణ ఎంపీలు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. రాజ్ నాథ్ సింగ్‌తో జరిగిన ఈ సమావేశం రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులకు ఊతమిస్తుందని భావిస్తున్నారు.



# సృష్టి కేసులో కొత్త కోణం

- **డాక్టర్ నమ్రతను ఒకరోజు కస్టడీకి తీసుకుని విచారణ**
- **పదేళ్ల సరోగసి కార్యకలాపాల్లో కోట్లు వసూలు.. పోలీసులు ఆవిష్కరణ**
- **నగదు లావాదేవీలు, బ్యాంక్ ఖాతాలు , యాప్ ఆధారిత అక్రమాలు**
- **మరింత కస్టడీ , సీరియస్ దర్యాప్తు**

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌పై కొనసాగుతున్న విచారణలో కేంద్ర క్రిమినల్ సర్వీస్ పోలీసులు కీలక వివరాలను సేకరిస్తున్నారు. ఈ క్రమంలో, ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రత ను ఒకరోజు కస్టడీకి తీసుకుని వివరమైన విచారణ చేపట్టారు. ఈ కేసులో ఏజెంట్ల నియామకం, శిశువుల కొనుగోలు, అక్రమ కార్యకలాపాలకు సహకరించిన అనేక డాక్టర్ల వివరాలను సీసీఎస్ అధికారులు సేకరిస్తున్నట్లు తెలిపారు. పోలీసుల దర్యాప్తు ప్రకారం, నమ్రత పదేళ్లుగా సరోగసి ముసుగులో కోట్ల రూపాయల వరకు వసూలు చేసిందని గుర్తించబడింది. సరోగసి కోసం హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ ప్రాంతాల నుండి వచ్చే దంపతుల వివరాలను ఆమె వేర్వేరు రికార్డులుగా నిర్వహించింది. అంతేకాకుండా, నమ్రత అక్రమంగా వచ్చిన నగదు లావాదేవీల కోసం తన సిబ్బంది పేరుతో బ్యాంకు ఖాతాలను ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ లావాదేవీలు ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా నిర్వహించబడుతున్నాయి అనే అంచనాలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఈ తాజా వివరాల ఆధారంగా, సిసిఎస్ అధికారులు నమ్రతను మరొకసారి కస్టడీకి తీసుకుని విస్తృత విచారణ చేపట్టే అవకాశం ఉందని వెల్లడించారు. పోలీసులు ఆమె అక్రమ కార్యకలాపాలకు సంబంధించి సాక్ష్యాలను సేకరిస్తూ, మొత్తం వ్యవహారాన్ని పూర్వ వైవిధ్యంతో అన్వేషిస్తున్నారు. సృష్టి ఫెర్టిలిటీ కేసు సంచలనంగా మారడంతో, రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు ఈ వ్యవహారాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకుని పూర్తి స్థాయిలో విచారణ కొనసాగిస్తున్నారు. డాక్టర్ నమ్రత, ఆమె సహకారులతో పాటు, సరోగసి, శిశు వ్యాపారం, నగదు లావాదేవీలు, అక్రమ నెట్‌వర్క్ పై కూడా దర్యాప్తు జోరుగా కొనసాగుతున్నది.



# ఘనంగా చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి వేడుకలు

**చేర్యాల, సెప్టెంబర్ 10 (సిద్దిపేట పవర్)**

ఆధిపత్య పెత్తందారీ విధానాలకు వ్యతిరేకంగా ఆత్మగౌరవ పోరాట రణ నినాదాన్ని మోస్తూ దొరలను గడీలనుంచి ఉరికించి తెలంగాణ ప్రజల అస్థిత్వాన్ని,ఆత్మగౌరవాన్ని కాపాడిన వీరవనిత, తెలంగాణ పౌరుషాన్ని,త్యాగాన్ని, పోరాటాన్ని భావి తరాలకు అందించి ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 40 వ వర్ధంతి సందర్భంగా రజక సంఘం మండల అధ్యక్షుడు శివగారి అంజయ్య ఆధ్వర్యంలో స్థానిక అంగడి బజార్ వద్ద ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా చేర్యాల మున్సిపల్ మాజీ చైర్మన్ అంకుగారి స్వరూపా రాణి శ్రీధర్ రెడ్డి , BRS పార్టీ రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల నర్సయ్య గారు హాజరై ఐలమ్మ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, వైస్ చైర్మన్ రాజీవ్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నవీన్ రెడ్డి ,మాజీ మాజీ కౌన్సిలర్ మంగోలు చంటి ,రజక విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలేటి రమేశ్, రాచకొండ శ్రీను, బండకింది కర్ణకర్ ,మంచాల కొండయ్య, బుట్టి అగమల్ల, తుమ్మలపల్లి శ్రీనివాస్, TMRPS అధ్యక్షుడు భుమిగారి రాజేందర్, రాళ్ళబండి పరిపూర్ణ ము, బురగోని తిరుపతి గౌడ్ తుమ్మల్ల పల్లు అంజయ్య , రమగల్ల బాబు , చింతల పరుష రాములు ,పచ్చిమడ్ల మానస, తుమ్మల్ల పల్లి పవన్ , పాక బాలయ్య, రాము, అవుషర్ల వెంకటేష్, పాక శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.




# లతా పేష్కర్ రచనలు స్ఫూర్తి దాయకం

- **రచయిత లతా పేష్కర్ ను సత్కరించిన ట్రస్మా**

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 10 ( సిద్దిపేటపవర్ ):** లతా పేస్కర్ రచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ట్రస్మా హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ప్రముఖ రచయిత్రి లతా పేష్కర్ ను ట్రస్మా ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. లతా పేస్కర్ రచించిన పలు రచనలు నేటితరం యువతరానికి స్ఫూర్తి కానున్నాయన్నారు.అవి వారిని ఎంతో చైతన్యం చేసేలా ఉన్నాయన్నారు. ఆమె రచించిన హిబ్బిస్కస్ హాట్, ది మిస్టీరియస్ టేల్స్ ఆఫ్ మహారాజపురం, మిట్టు మిస్ కటిట్స్, హరి నారాయణ స్ట్రీట్, మై మామ్ ఇస్ మై ఫేవరెట్ హీరో... వంటి అద్భుతమైన పుస్తకాలను ఆమె రచించారని, అవి ఎంతో ప్రభావితం చేస్తాయన్నారు. ఆలాంటి రచయితను సన్మానించుకోవడం తమకెంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా సభ్యులు పాల్గొన్నారు.




# శ్రీ రేణుక మాత అమ్మవారిని దర్శించుకున్న శ్రీ రాజయోగి సిద్దేశ్వర మహారాజ్



సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పెద్ద గుండవెల్లి గ్రామానికి చెందిన శ్రీ రేణుక మాత ఆలయాన్ని దర్శించుకున్న శ్రీ రాజయోగి సిద్దేశ్వర మహారాజ్. ఈ సందర్భంగా సిద్దేశ్వర మహారాజ్ మాట్లాడుతూ కోరిన కోరికలను ఇచ్చే అమ్మవారిగా దర్శమిస్తున్నారని, అమ్మవారు ఎంతో ఆకర్షణగా భక్తులకు దర్శనమిస్తున్నారు వచ్చే భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని మీకు ఉన్న కోరికలను తీర్చుకోవాలని, అదేవిధంగా దేవాలయ ప్రాంగణాన్ని కలియతిరిగి దేవాలయ కమిటీకి సూచనలు సలహాలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహారాజ్ కి ఘన స్వాగతం పలికి అమ్మవారిని దర్శనం పూర్తయిన తర్వాత అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించి సన్మానం చేయడం జరిగింది.. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఏల్పుల మహేష్, క్యాషియర్ కొంద్ర యాదగిరి, బోయ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోయ రాములు, జై కిసాన్ సీడ్స్ కంపెనీ ఓనర్ అధికం చక్రపాణి గౌడ్, దండు రాజు, ముతోల్ల దేవా, బీర్ల పరశురాములు , చేపూరి సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# దేశంలోనే నెంబర్ వన్ ఆసుపత్రిగా గాంధీని తీర్చిదిద్దుతాం

- **దేశంలోనే నెంబర్ వన్ ఆసుపత్రిగా గాంధీని తీర్చిదిద్దుతాం**
- **అడిషనల్ డీఎంఈ వాణీ**
- **ఆకస్మికంగా గాంధీ ఆసుపత్రి సందర్శన**

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 10 ( సిద్దిపేట పవర్ ) :**

కార్పోరేట్ ఆస్పత్రులకు తీసిపోని విదంగా సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిని తీర్చిదిద్ది బ్రాండింగ్‌కే బ్రాండ్ అంబాసిడర్‌గా దేశంలోనే నంబర్ వన్‌గా నిలుపుతామని మెడికల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డీఎంఈ ప్రొఫెసర్ వాణి అన్నారు. హెల్త్ మినిస్టర్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు ఆమె బుధవారం గాంధీఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వసతులు కల్పించి, నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు ఉద్దేశించిన బ్రాండింగ్ ప్రక్రియను ప్రారంభించినట్లు వివరించారు. టీజీఎంఎస్ఐడీసీ అధికారులు, గాంధీ పాలనయంత్రాంగంతో కలిసి అవుట్ పేషెంట్ విభాగంలోని రిజిస్ట్రేషన్, ఫార్మసీ కౌంటర్లు, అయుష్మాన్‌భారత్ (అభా) నమోదు, రోగుల టాయిలెట్లు, ఏఏ విభాగాలు ఎక్కడ ఉన్నాయో తెలిపే సైన్‌బోర్డుల ఏర్పాటు తదితర అంశాలపై ఆరా తీశారు. ఓపీ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి పాత టైంటేబుల్‌తో ఉన్న బోర్డులను అప్పటికప్పుడే తొలగించారు. సెంట్రల్‌ల్యాబ్, సీటీ స్కానింగ్ వద్ద గర్భిణీలు, మహిళలు పెద్ద సంఖ్యలో బారులు తీరిన దృశ్యాన్ని చూసిన ఆమె తక్షణమే ఆయా ప్రాంతాల్లో బెంచీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిరుపేద రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి వైద్యసేవల్లో జాప్యం చేస్తే ఎంతటివారైనా ఉపేక్షించేంది లేదన్నారు. ఓపీ విభాగంలో అనేక సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించేందుకు కృషి చేయకపోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

త్వరలోనే గాంధీకి స్పెషల్ ఆఫీసర్ నియామకం... వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశాల మేరకు గాంధీ ఆస్పత్రిలో త్వరలోనే స్పెషల్ ఆఫీసర్‌ను నియమిస్తామని అడిషనల్ డీఎంఈ వాణి స్పష్టం చేశారు. గాంధీఆస్పత్రిలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. స్పెషల్ ఆఫీసర్ నియామకంతో అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు.



గాంధీ పాలనయంత్రాంగం, వైద్యులు, మీడియా కలిసి నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామన్నారు. గాంధీకి స్పెషల్‌ఆఫీసర్‌గా వస్తారా అని మీడియా ప్రశ్నించగా, ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తానని అన్నారు. గాంధీ సూపరింటెండెంట్ సీహెచ్‌ఎన్ రాజకుమారి, ఆర్ఎంఓ-1 శేషాద్రి, అనస్టీషియా ప్రొఫెసర్ కిరణ్ మాదల, ఆర్ఎంఓలు సుధార్‌సింగ్, రజనీ, గాంధీ ఆఫీస్ మేనేజర్ వెంకటరమణ,శివరామిరెడ్డి లతోపాటు పలువురు వైద్యులు, అధికారులు పాల్గొన్నారు

# అంధకారంలో ఉన్న ఆ కుటుంబాన్ని ఆదుకున్న పూర్వ విద్యార్థుల కుటుంబ సభ్యులు.

**దుబ్బాక సిద్దిపేట పవర్ సెప్టెంబర్ 10 ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పెద్ద గుండవెల్లి గ్రామంలో తనకున్న రెండు కళ్ళు పోవడంతో మీడియాలో వచ్చిన కథనానికి స్పందించి కళ్ళు పోయిన మల్లు గారి శ్రీనివాస్ కు 5000 రూపాయల ఆర్థిక సాయంతో పాటు పండ్లను అందజేసిన పద్మ కుటుంబ సభ్యులు.. అదేవిధంగా పద్మ మాట్లాడుతూ తన పిల్లలు కండ్లు పోయిన మల్లు గారి శ్రీనివాస్ వద్దే విద్యను నేర్చుకున్నారని అదే కృతజ్ఞత భావంతో కళ్ళు కోల్పోయిన శ్రీనివాస్ సార్ కి మాకు తోచిన సాయాన్ని అందజేయడం జరిగిందని ఎంతో సంతోషంగా ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో తోటి మిత్రులు ఏల్పుల మహేష్ అధికం చక్రపాణి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# దుబ్బాకకు డిజిటల్ లైబ్రరీని తీసుకుస్తానని హామీ

- **జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ లింగమూర్తి**

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ సెప్టెంబర్ 10 ప్రతినిధి** దుబ్బాక లైబ్రరీ నీ సందర్శించిన జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి అదే విధంగా త్వరలోనే దుబ్బాకకు డిజిటల్ లైబ్రరీని తీసుకువస్తానని హామీ ఇవ్వడం జరిగింది మరియు లింగమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు లైబ్రరీని వినియోగించుకొని భవిష్యత్తులో దుబ్బాక ప్రాంతానికి లైబ్రరీకి మంచి పేరు తీసుకుని రావాలని కోరారు ఈ ప్రాంతం కోసం ఇక్కడ లైబ్రరీ కోసం నిరంతరం కీసర స్వామి ప్రయత్నం చేస్తున్నాడని వారితోపాటు లైబ్రరీని రాజు సార్ కృషి కూడా చాలా ఉందని అన్నారు లైబ్రరీ విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా కూడా అందుబాటులో కిసరి స్వామి ఉంటాడని వారితో ఏ విషయం ఉన్న చెప్పాలి అని అన్నారు అదే విధంగా దుబ్బాక లైబ్రరీ విద్యార్థులు లైబ్రరీ కోసం కృషిచేసిన పోరాటం మరువలేనిదని అన్నారు తప్పకుండా దుబ్బాక ప్రాంతానికి నూతన లైబ్రరీ నిర్మాణం వెంటనే తీసుకు వస్తానని ఆయన వెల్లడించారు



# ఆకారం గ్రామంలో నీటి శుద్ధికరణ పథకం ప్రారంభోత్సవమును ప్రారంభించిన సిద్ది పేట జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ లింగ మూర్తి

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ సెప్టెంబర్ 10ప్రతినిధి** దుబ్బాక నియోజక వర్గం ఆకారం గ్రామంలో గ్రామస్థుల సహకారంతో ఏర్పాటు చేసిన బాలవికాసము కార్యక్రమంలో పాల్గొని బాల వికాసం లాభాలు అదే విధంగా గ్రామస్తులు సహకారంతో మరింత అభివృద్ధి పదంగా నడుచుకోవాలని అన్నారు గ్రామాల్లో యువత మరింత అభివృద్ధి పదమూలో ఐక్యత గా ఉండి ముందుకు నడవాలి అని అదే విధంగా ఇలాంటి నీటి శుద్ధికారణ చేసినట్టువంటి వాటర్ తీసుకోవడం వలన పిల్లలా ఆరోగ్యపరంగా ఉంటారు అని అన్నారు అదే విధంగా ఈ వాటర్ ప్లాంట్ కు ధాతగా గ్రామస్తురాలీకి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అనిల్ మల్లయ్య మరియు దుబ్బాక లైబ్రరీయన్ రాజ్ కీసరీ స్వామి పాల్గొన్నారు



# ఘనంగా చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి

**నంగునూరు, సెప్టెంబర్ 10 (సిద్దిపేట పవర్)** నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆధిపత్యందారి విధానాలకు వ్యతిరేకంగా ఆత్మగౌరవ పోరాట రణ నినాదాన్ని మోస్తూ దొరలను గడిల నుంచి ఉరికించి తెలంగాణ ప్రజల అస్తిత్వాన్ని ఆత్మ గౌరవాన్ని కాపాడిన వీరవనిత తెలంగాణ పౌరుషాన్ని, త్యాగాన్ని, పోరాటాన్ని భావితరాలకు అందించి ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా నర్మెట్ట రజక సంఘం అధ్యక్షుడు చేర్యాల చేర్యాల చంద్రం, ఉపాధ్యక్షుడు శనిగరం యాదగిరి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మోతకాని కనకయ్య, కాంగ్రెస్ పార్టీ నేత చేర్యాల సాయికుమార్ రజక సంఘం సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# చదువుతో పాటు విద్యార్థులు ఆటల్లో రాణించాలి




- **118 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు పంపిణీ**
- **జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి**
- **దాతలకు కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం**

**దుబ్బాక సిద్దిపేట పవర్ సెప్టెంబర్ 10 ప్రతినిధి**

విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో రాణించి పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం తిమ్మాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్లో చదువుతున్న 113 మంది విద్యార్థులకు సిద్దిపేటకు చెందిన బి.దేవిక జ్ఞాపకార్థం వారి కుటుంబీకులు, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెంటయ్య ఉచితంగా క్రీడా దుస్తులను డిస్ట్రిక్ వెల్ఫర్ ఆఫీసర్ లక్ష్మీకాంతరెడ్డి, ఎం ఈవో జోగు ప్రభుదాస్, తో కలిసి జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి పంపిణీ చేశారు. రూ.53 వేల విలువ చేసే ఈ దుస్తులను విద్యార్థులందరికీ ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమని డీఈవో శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సువిశాలమైన పాఠశాలలో విద్యార్థులు ఏకగ్రతతో చదివి అనుకున్న లక్ష్యాలను సాధించడానికి పాఠశాల ఉపాధ్యాయ బృందం కృషి చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచి శుచికరమైన భోజనం అందించాలని డీఈవో సూచించారు.అనంతరం ఎంఈఓ జోగు ప్రభుదాస్ మండల స్థాయి ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేసి ఉన్నతా అధికారుల ఆదేశాల మేరకు "ఏక్ పేడ్ మాకే నామ్"పేరుతో మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో ఒక్కో ఉద్యోగి ఒక్కో మొక్క నాటి సంరక్షించాలసిన బాధ్యతలను చేపట్టాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మండల స్థాయి ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



# హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

- **బిఆర్ఎస్వి నంగునూరు మండల కో ఆర్డినేటర్ తప్పేట పర్శరాములు**

**నంగునూరు సెప్టెంబర్ 10 (సిద్దిపేట పవర్)**

నంగునూరు మండల కేంద్రం లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బి ఆర్ ఎస్ వి నంగునూరు మండల కో ఆర్డినేటర్ తప్పేట పర్శరాములు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ మన నీళ్లు మన నిధులు మన ఉద్యోగలను కొల్లకొడితే తట్టుకోలేక ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ నేత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సారథ్యంలో ఉద్యమం చేసి ఆ కాంగ్రెస్ పార్టీ మేడలు వంచి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా సాధించుకొని అనంతరం కాళేశ్వరం నిర్మాణం ద్వారా నీళ్లు సాధించి. ప్రత్యేక పరిశ్రమల ప్రోత్సాహం వనరులు అభిరుద్ది ద్వారా ఆర్థిక సుస్థిరత సాధించుకొని ఉద్యోగాల కల్పన వైపు అడుగులేస్తున్న తరుణంలో హైదరాబాద్ లోని అశోక్ నగర్ కి రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి వచ్చి అసత్య ప్రచారాలు అబద్దాలతో నిరుద్యోగుల్లో నాటి కెసిఆర్ ప్రభుత్వం పై విషం చిమ్మి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మళ్ళీ మన నీళ్లను ఆంధ్రకి మన నిధులని ఢిల్లీకి మన ఉద్యోగాలను అవినీతి పరులకి అప్పనంగా ఇవ్వడం సీఎం రేవంత్ రెడ్డి కి వెన్నతో పెట్టిన విద్యనే కాబట్టి, దానిని రాష్ట్ర అత్యున్నత న్యాయ స్థానం నిన్న హైకోర్టు కోర్టు తీర్పు రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి చెంపచెల్లు మనిపించేలా తీర్పు వచ్చిందని వివరించారు. కెసిఆర్ ప్రభుత్వం ఇచ్చిన గ్రూప్ 1 నోటిఫికేషన్ తదుపరి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగాయాని. ఆ పరీక్ష ఫలితాలని రద్దు చేస్తూ స్వయంగా హైకోర్ట్ తీర్పు ఇవ్వడం ప్రభుత్వ అసమర్ధతకు నిదర్శనం, నిరుద్యోగులు మాకు ఇప్పుడు పరీక్షలు వద్దు వద్దు అని అన్న వినకుండా ఆదర బాదరగా పరీక్షలు నిర్వహించడం అవినీతి కాంక్షకు నిదర్శనం అని తేటతేల్లం అయ్యిందని పేర్కొన్నారు వెంటనే మొత్తం పరీక్షలని రద్దు చేసి నూతనంగా మళ్ళీ నిర్వహించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి నాయకులు ఏలేటి అనిల్ రెడ్డి, రంగు చింటు గౌడ్, తాటికొండ రాజు, ఇమ్రాన్, చౌదరి సంపత్ యాదవ్, బన్నీ, చిన్నా తదితరులు పాల్గొన్నారు.






## చాకలి ఐలమ్మ అడుగుజాడల్లో నడవాలి

- **మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు**

తెలంగాణ ప్రజల తెగువను, పోరాటాల స్ఫూర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన ధీర వనిత చాకలి ఐలమ్మ అని మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నిజాం రజాకార్లతో వీరోచితంగా పోరాడిన వీర నారీమణి చాకలి ఐలమ్మ వర్ధంతిని సిద్దిపేట జిల్లా కేంద్రంలో మున్సిపల్ పాలకవర్గం, రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సుడా పార్క్ వద్దగల చాకలి ఐలమ్మ, సిరిసిల్ల రోడ్ లోని చాకలి ఐలమ్మ కాంస్య విగ్రహానికి మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, రజక సంఘం నాయకులు భూంపల్లి శ్రీహరి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులతో కలిసి వారు మాట్లాడారు. గతంలో తెలంగాణ ను పాలించిన నిజాం రాజులు రజాకార్లను అడ్డు పెట్టుకుని తమ భూములు స్వాధీనం చేసుకోవాలని చూసినప్పుడు చాకలి ఐలమ్మ వారిని ఎదిరించి తన భూమిని కాపాడుకుందన్నారు. రజాకార్లతో ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ మలిదశ ఉద్యమానికి స్ఫూర్తి అయిందన్నారు. చాకలి ఐలమ్మ అడుగుజాడల్లో నడుస్తూ ఆమె ఆశయాలను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలోగౌరవ అధ్యక్షులు భూంపల్లి రాజలింగం, భూంపల్లి కనకరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, పట్టణ కౌన్సిలర్లు బర్ల మల్లికార్జున్, బి ఆర్ ఎస్ నాయకులు భూంపల్లి శ్రీహరి, గోపాలపురం నాగరాజు, బంధారం రాజు,రజక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు...



## లయన్ సామ శ్రీధర్ ను సన్మానించిన మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ రాజమౌళి

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :**

లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320 డి లో 2024 25 సంవత్సరంలో మీల్స్ ఆన్ వీల్స్ బెస్ట్ అవార్డు సర్వీస్ అవార్డ్ అందుకున్న లయన్ సామ శ్రీధర్ కు బుధవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి స్వగృహంలో ఆర్యవైశ్య నాయకులతో కలిసి లయన్ సామ శ్రీధర్ కు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఎన్ సీ రాజమౌళి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మీల్స్ ఆన్ వీల్స్ బెస్ట్ సర్వీస్ అవార్డ్ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వారు బెస్ట్ సర్వీస్ అవార్డ్ అందజేసిన సందర్భంగా వారికి చిరు సన్మానం చేయడం జరిగిందని వారు ఇలాంటీ అవార్డులు మరిన్ని అందుకోవాలని అన్నారు,అనంతరం లయన్ సామ శ్రీధర్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అందులో నేను సైతం భాగస్వామ్యం కావడం, నా సేవలు గుర్తించి నాకు అవార్డు రావడానికి సహకరించిన ప్రతి ఒక్క లయన్స్ క్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు, ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ధార్మిక చైర్మన్ డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి, కిరాణా అసోసియేష్ అధ్యక్షుడు సిద్ది బిక్షపతి, సీనియర్ నాయకుడు తోట బిక్షపతి,కొండ పోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ గోలి సంతోష్,సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ సీ సంతోష్, లెంకల పల్లి శ్రీనివాస్, కొమరవెల్లి శంకరయ్య,ఉత్తునూరి సంపత్,సైదులు, రాము తదితరులు పాల్గొన్నారు.

## మోడీ జన్మదినం సందర్భంగా సేవా పక్ష్ కార్యక్రమం ..

- **15 రోజుల పాటు జరగనున్న సేవా కార్యక్రమాలు..**
- **ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలి..**
- **యూరియా సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం**
- **మెదక్ ఎంపీ రఘునందన్ రావు**

**సిద్దిపేట సెప్టెంబర్10**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 75వ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ వరకు దేశ వ్యాప్తంగా"సేవా పక్ష్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మెదక్ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బిజెపి జిల్లా కార్యాలయంలో సేవా పక్ష్ కు సంబంధించి ఏర్పాటు చేసిన కార్యశాల అనంతరం ఎంపీ రఘునందన్ రావు మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు సేవాపక్ష్ నిర్వహిస్తామని తెలిపారు. సేవా పక్ష్ లో భాగంగా మొక్కలు నాటడం, స్వచ్ఛ భారత్, ప్లాస్టిక్ నిషేధం, రక్త దాన శిబిరాలు, పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమం, స్వదేశీ వస్తువులను ఊతమివ్వడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రకృతి ని కాపాడేందుకు ప్రతి వ్యక్తి ఒక మొక్కను నాటాలన్నారు. బంగ్లాదేశ్, నేపాల్ లా కాకుండా నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత్ గట్టిగా నిలబడిందన్నారు. మోడీ ప్రధాని అయ్యే నాటికి ఈ దేశ ఆర్థిక వ్యవస్థ 11వ స్థానంలో ఉంటే నేడు మూడవ స్థానానికి చేరిందన్నారు. ఆత్మ నిర్బర భారత్ గా ఎదగాలని, వికసిత భారత్ వైపు నడవాలని ఈరోజు కార్యశాల నిర్వహించామని తెలిపారు. ప్రజలందరూ ముందుకు వచ్చి మోడీ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నామన్నారు. ప్లాస్టిక్ ను నివారించేందుకు అధికారులు ,ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. అదే విధంగా జీఎస్టీ మీద వర్తక, వాణిజ్య వ్యాపారస్తులతో ఈ నెల 12న గజ్వేల్ లో, 13న సిద్దిపేట లో అవగాహన సదస్సులు నిర్వహించబోతున్నామని తెలిపారు.


**యూరియా సరఫరాలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం**

రైతులకు టోకెన్లు అందించి యూరియాను సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు. రైతులకు ఎంత అవసరం ఉందో వ్యవసాయ అధికారుల ద్వారా తెలుసుకొని అందుకు తగ్గట్టు ఉన్నతాధికారులు యూరియా దిగుమతి చేసుకోవాలని తెలిపారు. ఒకవేళ నిజంగా కొరత ఉంటే తాము భారత ప్రభుత్వాన్ని ఒప్పించి యూరియా దిగుమతి చేయిస్తామని అన్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, విబిషన్, మార్కం దేయులు,తదితరులు పాల్గొన్నారు..



## ఎఫ్ డి సి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి ని పరామర్శించిన గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి


**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎఫ్డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి మాతృమూర్తి ఇటీవలే మృతి చెందిన విషయం తెలుసుకొన్న గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షుడు తుంకుంటా నర్సారెడ్డి జగదేవపూర్ మండలంలోని దౌలాపూర్ గ్రామంలో వంటేరు వజ్రమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.అయన వెంట గజ్వేల్ ఎఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి వంటిమాండి అఎంసీ చైర్మన్ మోహన్ గజ్వేల్ ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ గజ్వేల్ మజీద్ కమిటీ చైర్మన్ మతిన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి జిల్లా యూత్ నాయకులు చిలుకూరి మహేందర్ రెడ్డి మాజీ సర్పంచ్ బత్తిని మల్లేశం కొంపల్లి కర్ణాకర్ మాజీ ఎంపీటీసీ మహేందర్ రెడ్డి దయాకర్ రెడ్డి మల్లికార్జున రెడ్డి భాస్కర్ రెడ్డి జంగని ఐల్లయ్య సురేష్ మహేష్ అమర రాము అజిజ్ మిట్టపల్లి వెంకటేష్ ఆంజనేయులు దండే వెంకటేష్ కుకునూరి కృష్ణ జూపల్లి మహేష్ బైండ్ల చిరంజీవి యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.



## వజ్రమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :**

గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎఫ్డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి మాతృమూర్తి ఇటీవలే మృతి చెందిన విషయం తెలుసుకొన్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మ రెడ్డి మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి జగదేవపూర్ మండలంలోని దౌలాపూర్ గ్రామంలో వంటేరు వజ్రమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అదేవిధంగా మాజీ యఫ్ డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి ని పరామర్శించారు.





## వజ్రమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం** బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎఫ్డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి మాతృమూర్తి ఇటీవలే మృతి చెందిన విషయం తెలుసుకొన్న మెదక్ ఎంపీ మాధవనేని రఘు నందన్ రావు జగదేవపూర్ మండలంలోని దౌలాపూర్ గ్రామంలో వంటేరు వజ్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే గజ్వేల్ మాజీ యఫ్ డీ సీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి ని పరామర్శించారు. అయన వెంట గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ గొర్రె భాస్కర్ యశ్వంత్ రెడ్డి మనోహర్ బిజెపి మండల అధ్యక్షుడు ఐలయ్య కందుల బాల్ రాజు కుమార్ మంజే నర్సమ్మ అనిత వెంకటేశం మేధా అజిత్ రెడ్డి బిజెపి కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



## చాకలి ఐల్లమ్మ అడుగు జాడల్లో యువత ఆదర్శ కావాలి

- **గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే డీసీసీ జిల్లా అధ్యక్షులు తుంకుంటా నర్సారెడ్డి**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** జగదేవపూర్ మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ చౌరస్తా లో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా వీరవనీతకు చాకలి ఐల్లమ్మ విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించిన మాజీ శాసనసభ్యులు జిల్లా డీసీసీ అధ్యక్షుడు తుంకుంట నర్సారెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుదా పోరాట యోధురాలు విరవనీత చాకలి ఐల్లమ్మ దొరల రజాకార్ల అరాచకాలను సవాల్ చేసి మహిళా శక్తి ని ప్రపంచానికి చాటిన విరనారి. తెలంగాణ రైతంగా పోరాటం లో ముఖ్య పాత్ర పోషించిదని అన్నారు. భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం తెలంగాణ సాయుధ రైతంగా పోరాటం లో స్ఫూర్తినిచ్చిన విరనారి చాకలి ఐల్లమ్మ అని కొనియాడారు. యువత ఆమె అడుగు జాడల్లో నడవాలని అన్నారు. నిజం నవాబుకు టోట్టులైనభూస్వాముల కు వ్యతిరేకం గా పోరాడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ మోహన్ గజ్వేల్ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ గజ్వేల్ మజీద్ కమిటీ చైర్మన్ మతిన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి మాజీ ఎంపీటీసీ మహేందర్ రెడ్డి మాజీ సర్పంచ్ బత్తిని మల్లేశం మాజీ సర్పంచ్ కొంపల్లి కరుణాకర్ దయాకర్ రెడ్డి మల్లిఖార్జున రెడ్డి, భాస్కర్ రెడ్డి అమర రాము ఎండీ అజిస్ దండే వెంకటేష్ బైండ్ల చిరంజీవి సిద్దిరాల సురేష్ ఎర్ర సత్యం తాటిపాముల ఆంజనేయులు, మిట్టపల్లి వెంకటేష్, రాచకొండ మహేష్ జగదేవపూర్ యూత్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## తొగుటలో గురు పూజోత్సవ కార్యక్రమం

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ (తొగుట )సెప్టెంబర్ 10**

మండల వనరుల కేంద్రం (ఎమ్ఆర్సి) నందు గురు పూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించడం జరిగింది. ఈ సందర్భం గా ఎమ్ఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి గొప్పదని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కు బాటలు వేసేది ఉపాధ్యాయులేనని, ఉపాధ్యాయులందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి విద్యార్థుల సంఖ్యను పెంచేలా కృషి చేయాలని సూచించారు. ఈ సన్మానంలో వివిధ కేటగిరీలో చెందిన 23 మంది ఉపాధ్యాయుల సన్మానించడం జరిగినది. వారితోపాటు జిల్లాలో ఉపాధ్యాయులుగా సన్మానం పొందిన నలుగురిని కూడా ఎంఈఓ సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండలంలోని కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు అంజిరెడ్డి, ఉపేందర్, నయీమా కౌసర్ తో పాటు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి తో పాటు మండలంలోని ఉపాధ్యాయ సంఘాల నాయకులు రామచంద్రారెడ్డి, సురేందర్ రెడ్డి, రాములు, బాలరాజు, శ్రీనివాస్, మల్లేశం పాల్గొనడం జరిగినది.




## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుడికందుల విద్యార్థులు సస్యరక్షణపై క్షేత్రస్థాయి సందర్శన.

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ ( తొగుట )సెప్టెంబర్ 10 ప్రతినిధి**



ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థినిలు క్షేత్రస్థాయి వ్యవసాయ పరిశోధనలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులతో కలిసి పత్తి, జొన్న, చిరుధాన్యాల పంటలను రసాయనాలు వాడకుండా పేరమోన్, ట్రాప్ జిగురు అట్టలు వాడకం విద్యార్థులకు కృత్రిమ ఎరువుల వాడకం వివిధ రసాయనాలను చల్లడం వల్ల కలిగే నష్టాలను గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి భవిష్యత్తులో ప్రజలు క్రిమిసంహారక రహిత పద్ధతులను వాడి క్రిమి కీటకాలనుండి పంటలను రక్షించుకోవాలని వ్యవసాయ విద్యార్థినులు తెలిపారు. క్షేత్ర పర్యటనలో కుడికందుల పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పరుపాటకం, అంజి రెడ్డి, జీవశాస్త్ర ఉపాధ్యాయులు బిక్షపతి, శివయ్య ఉపాధ్యాయులు ఈ పర్యటనలో భాగస్వాములయ్యారు.